# సత్యమేవజయతే



— మహర్షి.

(భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ''చిన్నకథ'' జగత్ప్రసిద్ధం. అది అన్నిభాషల వారికి చిన్నకథే. ఆ చిన్నకథలో ఎన్నో, ఎన్నెన్నో భావార్థాలు, గూడార్థాలు నిక్షిప్తమై వుంటాయి. వాటిని ఆస్వాదించి, ఆనందించి, తరించింది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యోపన్యాసాల నుండి స్వీకరించి రచించిన ఆర్.బి. సీతాలక్ష్మి గారి చిన్నకథ ఆధారముతో— మహర్షి).

## కర్మ—ఫలితము

ఒక ఊరిలో పిండి మిల్లు యజమాని వున్నాడు. అతను ఒకనాడు హరికథా కాలక్షేపమునకు వెళ్ళి, హరికథ దాసుగారు చెప్పిన మాటలు శ్రద్ధగా ఆలకించాడు. ఆయన అనేక సూక్తులు వల్లిస్తూ ''అన్నదానము కన్నను మిన్నయైన దానము లేదు. అన్నదాన ఫలితము వలన మనకు స్వర్గప్రాప్తి కలుగుతుంది'' అని ప్రభోధించాడు. హరిదాసు చెప్పినట్లు తప్పక అన్నదానం చేసి స్వర్గప్రాప్తిని పొందవలెనని పిండి మిల్లు యజమాని అనుకున్నాడు. అయితే అతను లోభి. అందువలన ఇతరులకు ఆహారాన్ని అందించే విషయంలో కూడా సంకుచిత దృష్టిని అవలంభించాడు. తన ఇంటిలో ఎన్నో సంవత్సరాలుగా సంచులలో మూలపడిన గోధుమ పిండిని బయటకు తీసి, ఆ పిండితో రొట్టెలువేసి ప్రతిదినము అయిదు ఆరుగురికి పెట్టడం ఆరంభించాడు. ఆ పిండి చీమలు, పురుగులు కూడా తినలేనంతగా చెడిపోయింది. అట్టి పనికిరాని పిండితో రొట్టెలు పెడుతున్నాడు లోభి అయిన మిల్లు యజమాని.

అతని భార్య బహు గుణవంతురాలు. భగవద్విశ్వాసము కల ఇల్లాలు. ఆమె ఈ పరిస్థితి చూసి ''ఏమండీ! ఇలా చెడిపోయిన పదార్థాలను ఇతరులకు పెట్టడం మనకు మహా పాపము కలుగుతుంది. మనవద్ద మంచి పిండి చాల వున్నది. దానితో ఒకరిద్దరికి పెట్టినా పవిత్ర కార్యమవుతుంది. అంతేకానీ, ఈ పనికిరాని పిండితో ఎంతమందికి దానం చేస్తే మాత్రం ఏం ప్రయోజనం?'' అని భర్తకు చాల సార్లు చెప్పింది. కానీ, ఆమె మాటలు భర్త పట్టించుకోలేదు.

ఒకనాడు యజమాని భార్యా పనికిరాని పిండితో చక్కగా రొట్టెలను తయారుచేసి భోజన సమయంలో భర్తకు వడ్డించింది. భర్త వాటిని నోట్లో పెట్టుకుని తినలేక భార్యను తిట్టాడు. అప్పుడామె చల్లని మాటలతో ''ఇది మీ మంచి కోసమే చేశాను. మనం ఈ లోకంలో చేసే కర్మలన్నింటికీ స్వర్గంలోనో, నరకంలోనో ఫలితం అనుభవించాల్సి వుంటుంది. మీరు ఈనాడు చేస్తున్నది దానం కాదు, మహా పాపకార్యం. దీని ఫలితాన్ని మీరు నరకంలో అనుభవించాల్సి వుంటుంది. ఆనాడు క్రొత్తగా ఈ రొట్టెల్ని మీరు తినలేరు. అందుకని ఈ రోజు నుండే మీకు ఈ రొట్టెలు తినడం అలవాటు అవుతుందని ఇలా రొట్టెలు చేశాను'' అని పలికింది. ఈ మాటలకు భర్త బుర్ర గిర్రున తిరిగింది. ఆమె మాటలలోని సత్యాన్ని గ్రహించి తన మనస్సుని మార్చుకుని మంచి పిండి పదార్థాలను దానం చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆధ్యాత్మిక రంగంలో సులభమార్గంలో ఫలితాన్ని అనుభవించాలనుకోవడం, స్వార్థంతో కుయుక్తులతో పుణ్యకార్యాలను చేయాలనుకోవడం ఆత్మవంచన అవుతుందని బాబా గారు బోధిస్తుంటారు. ●

## సూక్తులు

★ చాలామంది సద్గుణాలను కీర్తిస్తారు. కాని పాటించరు.

— మిల్టన్.

★ ఉత్సాహమివ్వని సుగుణం క్షేమం కాదు.

— సీలీ.

★ నీకు నిన్ను మించిన సలహాదారులెవ్వరూ లేరు.

— అజ్ఞాత్.

★ దేవుడు సత్యమని చెప్పేకంటే సత్యమే దేవుడని చెప్పటం సరియైనది.

— గాంధీజీ.

★ నెల రోజుల గ్రంథ పఠనం కంటే తెలివైన వ్యక్తితో గంట సంభాషణ మేలు.

- చైనా సూక్తి.

★ కఠోర పరిశ్రమ అనంతరం వరించే విజయం తియ్యగా వుంటుంది.

- హెచ్.డబ్ల్యు. బీచర్.

★ గొప్ప వ్యక్తులు ఆశయం కోసం, నీచులు బలహీనులు ఆశలకోసం జీవిస్తాము.

— చైనా సామెత.

★ సాంఘిక ప్రయోజనం కలిగి మాత్రమే పురుషులు సాధించవలసిన విజయమైన విజయాలు.

— ఆల్ఫ్రెడ్ ఆడ్లర్.

★ జాప్యంలో మన శక్తులన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయి.

★ ప్రసన్న హృదయం కలవారి ముఖం ఎప్పుడు విప్పారి ఉంటుంది.

— బైబిల్.

సేకరణ: పట్నం శేషంశెట్టి, నంద్యాల.

■ ■